క్లుప్తంగా

శివారు భూములకు సాగునీరు



నీటిని విడిచిపెడుతున్న డీఈఈ శ్రీహరి

జలుమూరు: శివారు భూములకు సాగునీరు అందించేందుకు అంతా సిద్ధం చేశామని నరసన్నపేట సబ్ డివిజన్ డీఈఈ బి.శ్రీహరి తెలిపారు. రాణ వద్ద వంశధార ఎడమ కాలువ అనుసంధానంగా ఉన్న నరసన్నపేట బ్రాంచ్ కాలువకు శనివారం నీరు విడుదల చేశారు. నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాల్లో 36 వేల ఎకరాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందిస్తున్నామన్నారు. రైతులు సహకరించి నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఏఈఈలు ఎం.వి.సురేష్ కుమార్, ఎ.శ్యామలరావు, కేవీ రమణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



విద్యార్థుల తల్లిదండ్రులకు పురస్కారాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మెళియాపుట్టి: ఉత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం ఆనందదాయకమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి మంచి మార్కులు సాధించిన నోంద్రాన మనశ్యంద్ర, ఇసై లిఖిత తరఫున తల్లిదండ్రులకు మెమొంటోలను శనివారం అందజేశారు. హెచ్ఎం ఏవీ రమణ మాట్లాడుతూ.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఇలా సత్కరించడంతో మరిన్ని ఫలితాలు సాధిస్తారన్నారు. అనంతరం తల్లిదండ్రులను అభినందించారు. ఉపాధ్యాయులు కొర్ల రెయ్యన్న, రవి, పూర్వ విద్యార్థులు మోహనరావు, సుందరరావు, లోహితాఖ్యుడు తదితరులు ఉన్నారు.

పరామర్శ..



జ్ఞానేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండలంలోని వండానవలస గ్రామానికి చెందిన బోర జ్ఞానేశ్వరరావు తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం పరామర్శించారు. అలుదులో శిమ్మ రాంబాబు తల్లి మృతి చెందంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకులు నక్క తులసీదాస్, యాళ్ల శ్యామసుందరరావు, తంగి రమణ తదితరులు ఉన్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బాలచంద్ర

ఆమదాలవలస రూరల్: కంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి ఎం.బాలచంద్ర అన్నారు. మండలంలో తోటాడ గ్రామంలో దూసి పీహెచ్‌సీ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ ప్రభావంతో జ్వరాలు, కంటి కలకలు వంటి వాటిని పరీక్షించి, రోగులకు సూచనలు అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సేవలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సిబ్బంది సూచించారు.

పరిశుభ్రత పాటించాలి



కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ సుజాత

నరసన్నపేట: ఫైలేరియా రోగులు వైద్యుల సూచనల మేరకు ఆరోగ్య పరిశుభ్రత పాటించాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో గుర్తించిన ఫైలేరియా రోగులు 53 మందికి ఉచితంగా మందులు, పరిశుభ్రత కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫైలేరియా రోగుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. రోగులు విధిగా వైద్యుల సూచనలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఎంపీహెచ్‌ఓ టి.గణపతిరావు, సూపర్ వైజర్లు జీవీ రమణ, కె.అనూరాధ పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: కణుగులవలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



నరసన్నపేట: మాకివలసలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జగనన్న సురక్షతో ఉచిత సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరంలా మారింది. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏం అవసరమో తెలుసుకుంటున్నారు. ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించి లబ్ధిదారులకు 11 రకాల ఉచిత సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: సచివాలయం–3లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సారవకోట: పెద్దలంబలో ధ్రువపత్రాలు అందస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



మెళియాపుట్టి: వెంకటాపురంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి, అధికారులు



జలుమూరు: మర్రివలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

గడపగడపకూ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: రాష్ట్రంలో పేదల ముఖాల్లో చిరునవ్వులు వెలగాలనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కోటిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు.

అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత సచివాలయ సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు తెలియజేయాలన్నారు. పథకాలు కోసం ఎవరికి ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రతీ కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో కాలువలు, రోడ్లు కావాలని ప్రజలు స్పీకర్‌ను కోరారు. తొలిత జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.55 లక్షలతో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కిల్లి నాగేశ్వరరావు, అసిరినాయుడు, డీఈ సూర్యనారాయణ, ఎంపీడీఓ హరిహరరావు, ఏఈ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కలమటకు రాజకీయ భిక్ష పెట్టింది సీఎం జగన్

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట (కొత్తూరు): పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ భిక్ష పెట్టారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరు మండలం మెట్టూరు బిట్–2, మాతల గ్రామ సచివాలయాల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నుంచి 2014లో గెలిచిన కలమట.. అధికార దాహం కోసం, ఆర్థిక ప్రయోజనాల కోసం పార్టీ ఫిరాయించారన్నారు. కలమటకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన సీఎం జగన్‌కు రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందన్నారు. టీడీపీ నాయకులు మరోసారి మాయమాటలు చెప్పేందుకు ప్రజల వద్దకు వస్తున్నారని, వారిని నమ్మవద్దన్నారు. అధికారులు, పార్టీ నాయకులు సారిపల్లి ప్రసాదరావు, బూర్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం విద్యుత్ స్తంభాలను మార్పిడి చేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు సబ్‌స్టేషన్ పరిధిలో గల కొత్తరోడ్డు, గోపీనగర్, తోటాడ, అక్కివరం, మహసాహెబ్‌పేట గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఎల్.ఎన్.పేట మండలంలో..

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచెంద్రి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ వీపీ రాజశేఖర్ శనివారం ప్రకటించారు. చొర్లంగి, జాడుపేట తదితర గ్రామాలకు ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. చెట్లు కొమ్మల తొలగింపు, విద్యుత్ వైర్లు సరిచేయటం వంటి పనులు చేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

రహదారి పనులు పూర్తి చేస్తాం

నరసన్నపేట: మండలంలోని రావులవలస గ్రామానికి వెళ్లే రోడ్డు పనులు పూర్తి చేస్తామని పీఐయూ డీఈ వెంకటరావు అన్నారు. రూ.1.20 కోట్లు మంజూరయ్యాయని, దీంట్లో కొంత మేరకు పనులు అయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు కూడా పూర్తిచేస్తామన్నారు. గ్రామస్తులు అపోహలకు పోవద్దని కోరారు. ఈ రోడ్డును పరిశీలించడం జరిగిందని అన్నారు. ప్రజలు ఎటువంటి అనుమానాలకు పోవద్దని కోరారు.

గడ్డి నివారణ మందు పిచికారీ



గడ్డి నివారణ మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న మిశ్రో

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గడ్డి నివారణ మందు పిచికారీ చేసినట్లు ఎస్‌ఓ ఎం.అంబిక శనివారం తెలిపారు. కేజీబీవీలో ఉన్న ఖాళీ స్థలంలో గడ్డి పెరగటం వల్ల విష సర్పాలు చేరుతాయని, ఈ సమస్య గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ సెంట్రల్ కార్యవర్గ సభ్యుడు ఎంకె మిశ్రో దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన స్పందించి ఆర్థిక సహాయం చేయటంతో గడ్డి నివారణ మందు పిచికారీ చేశామన్నారు. తమవంతు సహాయం కూడా అందించి గడ్డి నివారణ మందుతోపాటు కూలీలను సమకూర్చామని ఎస్‌ఓ తెలిపారు. ఖాళీ స్థలంలో పెరటి కూరగాయలు పండిస్తామన్నారు.

త్రివర్ణ పతాకాల ప్రదర్శన

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాలలో శనివారం త్రివర్ణ పతాకాల ప్రదర్శన నిర్వహించారు. 1947 జూలై 22న జాతీయ జెండా నమూనాను రాజ్యాంగ సభ ఆమోదించింది. దీన్ని పురస్కరించుకుని విద్యార్థులు పాఠశాల ఆవరణలో శనివారం త్రివర్ణ పతాకాల ప్రదర్శన చేపట్టినట్లు పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ తెలిపారు.



త్రివర్ణ పతాకాలతో విద్యార్థులు

సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి

- గైర్హాజరైన అధికారులపై చర్యలకు చేపట్టాలి
- మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

సరుబుజ్జిలి: వంశధార ప్రధాన కాలువలతోపాటు, పిల్ల కాలువల్లో పూడిక, గుర్రపు డెక్క పేరుకుపోవడంతో ఆయకట్టు రైతులు సాగునీటికి అవస్థలు పడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు తీర్మానం చేసి పంపాలని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. అనంతరం శాఖల వారీగా చర్చ నిర్వహించారు. కొత్తకోట, కొత్తపేట, అలమాజీపేటల్లో అంగన్‌వాడీ నూతన భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. తురకపేట రేషన్ డిపో నుంచి సరకులు అరకొరగా అందడం వల్ల కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారని జెడ్పీటీసీ సభ దృష్టికి తెచ్చారు. అమృతలింగానగరం, రావివలసల్లో పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని ఎంఈఓ బాలరాజుకు సభ్యులు తెలిపారు. విద్యార్థులు తక్కువగా ఉండి, ఉపాధ్యాయులు అధికంగా ఉన్న చోట వేరొక పాఠశాలకు బదిలీ చేయాలన్నారు. కె.జె.పేట గ్రామానికి 104 వాహనం రావడంలేని, ఏఎన్ఎంను విజయరాంపురం పంపిండం వల్ల వైద్య సేవలు సక్రమంగా అందడంలేదని సర్పంచ్ బెండి అప్పలనాయుడు అధికారుల దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఈఓపీఆర్డీ ఆనందరావు, వైద్యాధికారి భవ్యశ్రీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నరసన్నపేట అభివృద్ధికి పెద్దపీట



వంశధార కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: మేజరు పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని పోలాకి జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ కన్వీనర్ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. నరసన్నపేటలో పలుచోట్ల రహదారుల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజుల చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. అన్ని వీధుల్లో సీసీ రోడ్లు వేస్తామన్నారు. ఈ నాలుగేళ్లలో రెండు కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి రహదారులను నిర్మించామన్నారు. మార్కెట్‌ను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేస్తామన్నారు. బైరి వీధిలో పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో కాంక్రీట్ రోడ్డు పనులు, వంశధార కాలనీలో గడపగడపకు నిధులు రూ.4 లక్షలతో కాంక్రీట్ రోడ్డు, కాలేజీ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే గ్రాంట్ రూ.5 లక్షలతో చేపట్టిన పనులను ప్రారంభించారు. పైడితల్లి ఆలయం నుంచి బొరిగివలస రోడ్డులో చెరువుకు ఆనుకొని, దేశవానిపేటలోని గడ్డెయ్య చెరువు వద్ద ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మొక్కలు నాటారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ కృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుప్త, పాగోటి రాజారావు, నర్సింగరావు, సదాశివుని కృష్ణ, అశిరినాయుడు, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



శిక్షణ ఇస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్

బూర్జ: మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్ అన్నారు. మండలంలోని పాలవలస పంచాయతీ పరిధిలో గల రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆవరణలో శనివారం నిర్వహించారు. పొలంబడి విధివిధానాలు, అనుసరించాల్సిన పద్ధతులు, విత్తన శుద్ధి, ప్రీ బ్యాలెట్ బాక్సు, పరీక్ష, నమూనా సేకరణపై శిక్షణ ఇచ్చారు. డీడీ ఎ.త్రినాథ స్వామి, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రాజగోపాలరావు, డీఆర్సీ పీడీ కె.కృష్ణారావు, హార్టికల్చర్ సీనియర్ సైంటిస్టు భగవాన్, ఎఫ్‌టీసీ ఏఓ సూర్యకుమారి, ఏఓ వి.రాజేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి బి.అయింతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పాలవలస, రామన్నపేట, గోపిదేవిపేట, సోవిదలవలస, బొమ్మిక గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే నేర నియంత్రణ




అర్ధ సంవత్సర నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం క్రైమ్ : అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తే నేర నియంత్రణ సాధ్యమవుతుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ఎస్పీ జీఆర్ రాధిక అధికారులకు సూచించారు. శనివారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎస్పీ రాధిక అధ్యక్షతన వివిధ శాఖల ఉన్నతాధికారులు, పోలీసు అధికారులతో నిర్వహించిన అర్ధ సంవత్సర నేర సమీక్ష సమావేశానికి కలెక్టర్ లాఠకర్, జడ్జి అహ్మద్ మౌలానాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మేరకు ఎస్పీ జిల్లాలోని రహదారి, ప్రమాదాల నివారణకు, నేర నియంత్రణకై చేపడుతున్న చర్యలు గురించి తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అంతా కలిసికట్టుగా పనిచేసి నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కుల ధృవీకరణ పత్రాలు త్వరితగతిన అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా జడ్జి మాట్లాడు తూ జైలులో ఉన్న ముద్దాయిలకు అనారోగ్య సమ స్యలు తలెత్తినప్పుడు డీఎంహెచ్‌ఓ ప్రతిరోజూ రొటే షన్ పద్ధతిలో ఓ వైద్యాధికారితో జిల్లా జైలులో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కేసుల విచారణలో సరైన సాక్ష్యాధారాలు, కేసు పత్రాలు సమర్పించాల ని సూచించారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకై ప్రత్యేక కార్యాచరణతో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు సాయంత్రం ఆరు గంటల తర్వాత జరుగుతున్నాయన్నారు. ప్రయాణ సమయంలో రోడ్డు భద్రతా నియమాలు పాటించే లా విస్తృతంగా అవగాహన కల్పించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా ఫారెస్టు అధికారి నిషాకుమారి, అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు (క్రైమ్), జె.తిప్పేస్వామి (అడ్మిన్), డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ ఎం.నాగమల్లేశ్వరా వు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు తిరుమలరావు, నాగభూషణ్, శివకుమార్, జిల్లాలోని పోలీసు అధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో డిగ్రీ చివరి సెమిస్టర్ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: త్వరలో డిగ్రీ చివరి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయనున్నట్లు బీఆర్ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్‌లైన్ శనివారం నిర్వహించారు. డిగ్రీ చివరి సెమిస్టర్ ఫలితాలపై ఎక్కువ మంది విద్యార్థులు ప్రశ్నించారు. దీంతో కనీసం రెండు వారాల్లో పరీక్ష ఫలితాలు వెల్లడిస్తామన్నారు. రీవాల్యుయేషన్ ఫలితాల్లో జాప్యంపై విద్యార్థులు ప్రశ్నించగా, విడుదలపై దృష్టి పెడతామని అధికారులు తెలిపారు. జిల్లాలో రెండు బీఎడ్ కళాశాలల బోధకులకు జీతాలు సక్రమంగా చెల్లించటం లేదని ఫిర్యాదు చేశారు. విచారణ చేస్తామని అధికారులు తెలిపారు. డిగ్రీ ఇయర్ ఎండ్ స్పెషల్ డ్రైవ్ పరీక్షపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్, చింతాడ రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైమ్ : అతి తీవ్ర నేరాల కేసులతో పాటు ప్రాధాన్యతా కేసుల దర్యాప్తు ముమ్మరం చేయాలని ఎస్పీ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో జూన్ నెలకు సంబంధించి నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్, ప్రాపర్టీ నేరాలు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ, ఎన్డీపీఎస్, మిస్సింగ్ కేసులు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం నేరాలు, మిస్సింగ్ కేసుల ఛేదన, కేసుల పరిష్కారం, దర్యాప్తు, సమాచారం సేకరణ, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణాచర్యలు, బెస్ట్ ఫైరింగ్ వంటి పలు అంశాలపై ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. వీరిలో ట్రాఫిక్ డీఎస్పీ సిహెచ్‌జీవీ ప్రసాదరావు, సీఐలు జి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎస్ఐలు బలివాడ గణేష్, అలీ మహ్మద్, బి.హైమావతి, ఎల్.రామకృష్ణ, ఎస్.బాలరాజు, ఎ.విజయ్‌కుమార్, ఎం.గోవిందరావు, ఎ.కోటేశ్వరరావు, జి.రాజేష్, మహిళా పోలీసులు ఎన్.గాయత్రి, టి.తేజవతి, ఎ.హారతి ఉన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు డి.బాలచంద్రారెడ్డి, యర్రగుంట శృతి, నాగేశ్వరరెడ్డి, ఎస్.బాలరాజు, ఎస్.వాసుదేవ్, సీహెచ్‌జీవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మహేంద్రతనయ ప్రవాహం తగ్గుముఖం



పాతపట్నం వద్ద మహేంద్రతనయ నదీ ప్రవాహం

పాతపట్నం: మహేంద్రతనయ నదీ ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఇటీవల ఒడిశాలో కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహించిన మహేంద్రతనయ శనివారం ఉదయానికి తగ్గింది. గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో గుమ్మాగెడ్డ, పోగడవల్లి గెడ్డ జోరుగా పారుతున్నాయి. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే పంట పొలాల్లో నీరు నిల్వ ఉండి, వరి వెద పంట కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సింగుపురం, లాబర, గంగువాడ, సీది, పెద్దలోగిడి తదితర గ్రామాల పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.